
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రేషన్ కార్డుదారులకు కందిపప్పు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పౌర సరఫరాల శాఖ శుక్రవారం నుంచి తెల్లరేషన్ కార్డుదారులందరికీ కందిపప్పు పంపిణీ చేస్తోంది. జిల్లాలో 1,233 చౌక ధరల దుకాణాలు, 6,76,209 తెల్లరేషన్‌కార్డులు ఉన్నాయి. నవంబరు నెలకు సంబంధించి బియ్యం 10,858.444 మెట్రిక్ టన్నులు, కందిపప్పు 512.547 మెట్రిక్ టన్నులు, చక్కెర 316.111 మెట్రిక్ టన్నులు, జొన్నలు 500 మెట్రిక్ టన్నులు వచ్చాయి.

పేదింట వెలిగిన దీపం

- దీపావళి కానుకగా ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు
- జిల్లాలో 6.46 లక్షల గ్యాస్ కనెక్షన్లు
- ఏడాదికి రూ.63.83 కోట్ల ఆర్థిక ప్రయోజనం

కర్నూలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాల్లో దీపావళి కాంతులు విరజిమ్మేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక పథకాన్ని అమలు చేసింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలో ఒకటైన ఉచిత సిలిండర్ పథకం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. దీపావళి పండుగను పురస్కరించుకొని పేదలకు అందించే ఈ పథకాన్ని జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యేలు, అధికారులు ప్రారంభించారు. ఇప్పటి వరకు ఇంటి ఖర్చులో భాగంగా ఉన్న సిలిండర్ వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది. దీంతో పేదలకు ఆర్థిక ఉపశమనం లభించినట్లయింది. జిల్లా వ్యాప్తంగా తెల్లరేషన్ కార్డు ఉండి భారత్, హెచ్‌పీ, ఇండెన్ గ్యాస్ కనెక్షన్లు కలిగిన 6.46 లక్షల పేద కుటుంబాలకు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేస్తారు. ఈ లెక్కన రాష్ట్ర ప్రభుత్వంపై కర్నూలు జిల్లా నుంచే ఏడాదికి రూ.63.83 కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.319.15 కోట్లు భారం పడనుంది. జిల్లా వ్యాప్తంగా మహిళలు చంద్రబాబు ప్రభుత్వం తీసుకొచ్చిన దీపం 2.0 పథకంపై హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.



కర్నూలులో మహిళలకు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్న మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, జేసీ నవ్య


మహిళలకు సిలిండర్లను పంపిణీ చేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి


మంత్రాలయంలో గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్న రాఘవేంద్రరెడ్డి



ఆలూరులో ఉచిత గ్యాస్ పథకాన్ని ప్రారంభిస్తున్న వీరభద్ర గౌడ్


ఉచిత సిలిండర్ల ఆటోకు పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి భరత్

పేదల జీవితాల్లో వెలుగులు

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దీపం 2.0 పథకం ద్వారా పేదల జీవితంలో వెలుగులు నింపుతున్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ సంక్షేమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం హామీలన్నీ నెరవేరుస్తున్నారన్నారు. దీపం 2.0 పథకం ద్వారా సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు పెట్టుబడులే లక్ష్యంగా ఐటీ శాఖ మంత్రి కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన నూతన ఇండస్ట్రియల్ పాలసీ మిగతా రాష్ట్రాలతో పోలిస్తే బాగుందన్నారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం దీపం 2.0 పథకం ద్వారా జిల్లాలో అర్హులైన 4,72,851 మందికి ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్నారన్నారు. ఈ పథకంపై రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోందన్నారు. అనంతరం ఉచిత గ్యాస్ సిలిండర్ల వాహనాన్ని మంత్రి జెండా ఊపి ప్రారంభించి బుధవారపేటలో లబ్ధిదారులు లక్ష్మీదేవి, దేవిక ఇళ్ల వద్దకే స్వయంగా వెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జేసీ నవ్య, ఆర్డీవో సందీప్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు, డీఎస్ఓ రాజా రఘువీర్, మెప్మా పీడీ నాగశివలీల, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

సీఎంకు ధన్యవాదాలు



తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి మూడు సిలిండర్లను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉంది. డబ్బులు కూడా 48 గంటలలోపు జమ అవుతాయన్నారు. సీఎం చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు.

\- పుష్పావతి కర్నూలు

మహిళలకు భరోసా



కూటమి ప్రభుత్వం మహిళలకు ఒక ఆర్థిక భరోసా కల్పించింది. ప్రతి సంవత్సరం మూడు సిలిండర్లు వాడుతున్నాం. ఇప్పుడు ఉచిత సిలిండర్ల వల్ల మాకు అదనపు ప్రయోజనం చేకూరింది. దీని వల్ల మా కుటుంబానికి ఎంతో ఆర్థిక ప్రయోజనం కలిగింది. నాలుగు నెలలకు ఒకసారి ఉచిత సిలిండర్ ఇవ్వడం సంతోషంగా ఉంది.

\-చిన్నమ్మ, కర్నూలు


ఉచిత గ్యాస్ సిలిండర్‌ను మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

యురేనియంపై యుద్ధం ...

- 11 గ్రామాల ప్రజలు, రాజకీయ నాయకుల సమావేశం
- ఐక్య పోరాటాలు దిశగా సన్నాహాలు

దేవనకొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్టులో యురేనియం తవ్వకాలపై సమీప గ్రామాల ప్రజలు యుద్ధం ప్రకటించారు. యురేనియం నిల్వల పరిశీలనకు కేంద్ర ప్రభుత్వం 68 బోర్లు వేసేందుకు అనుమతి ఇవ్వడంపై సమీప గ్రామాల ప్రజలు భగ్గుమంటున్నారు. తమ ఉనికిని ప్రశ్నార్థకంగా మార్చే యురేనియం తవ్వకాలు జరిపితే ప్రత్యక్ష పోరాటానికి దిగి అడ్డుకుంటామన్నారు. తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ఫారెస్టు సమీప గ్రామాలైన కప్పట్రాళ్ల, పి.కోటకొండ, ఈదులదేవరబండ, జిల్లెలబుడకల, మాదాపురం, బేతపల్లి, చెల్లెలచెలిమల, గుండ్లకొండ, బండపల్లి, నెల్లిబండ, బంటుపల్లి తదితర గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు శుక్రవారం ఫారెస్టులోని చెన్నకేశవస్వామి దేవాలయం వద్ద చేరుకొని తవ్వకాలకు వ్యతిరేకంగా ముక్తకంఠంతో నినదించారు.

మిగతా 4లో..


యురేనియం వ్యతిరేక సమావేశంలో పాల్గొన్న ప్రజలు

అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం


పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసిన జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని, తెలుగు జాతి ఔనత్యాన్ని కాపాడిన త్యాగమూర్తి అని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య కొనియాడారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి, చిల్డ్రన్స్ పార్కులోని విగ్రహానికి జేసీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు మాట్లాడే ప్రజలందరికీ ఒక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో పొట్టి శ్రీరాములు అమరణ దీక్ష చేశారన్నారు. భాషా ప్రాతిపదికపైన ఏర్పడిన మొట్టమొదటి రాష్ట్రం మన ఆంధ్ర రాష్ట్రం అన్నారు. ఆంధ్ర రాష్ట్రం 1953 అక్టోబరు 1వ న ఏర్పాటైనప్పటికీ పొట్టిశ్రీరాములు ప్రాణత్యాగం వల్ల ఏర్పడిన భాషా ప్రయుక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా 1956 నవంబరు 1న ఏర్పాటైందన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటలక్ష్మమ్మ, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అపార్ కష్టాలు

- తప్పుల తడకగా ఆధార్ వివరాలు
- డిజిటల్ కార్డుల జారీలో అడ్డంకులు



కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అథెంటిక్ రిజిస్ట్రీ) సంఖ్య అందించేందుకు కష్టాలు తప్పడం లేదు. ఆధార్‌లో ఉన్న సమాచారం మేరకు అపార్ కార్డులు జారీ అవుతున్నాయి. ఆధార్‌లో విద్యార్థుల వివరాలు తప్పుల తడకగా ఉండడంతో వాటిని ఆన్‌లైన్‌లో పొందుపర్చడానికి సమస్యలు తలెత్తుతున్నాయి. ముందుగా ఆధార్‌లోని వివరాలు సరి చేసి తర్వాత నమోదు చేయాల్సి వస్తోంది. ఆధార్ మార్చడానికి ప్రత్యేక అవకాశం కల్పిస్తే తప్ప ఆ ప్రక్రియ సజావుగా జరగదని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

30 శాతానికి పైగా విద్యార్థుల వివరాలు

జిల్లాలో అపార్ కార్డులు జారీకి కష్టాలు తప్పడం లేదు. ఈ కార్డులు జారీ బాధ్యతలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యాశాఖ అప్పగించింది. నవంబరు 30వ తేదీలోగా పూర్తి చేయాలని ఇది వరకే ఆదేశాలు జారీ చేశారు. చాలా మంది విద్యార్థుల వివరాలు పాఠశాల రికార్డులో ఒకలా.. ఆధార్ కార్డులో మరోలా ఉన్నాయి. ఒకసారి అపార్ కార్డు ఇస్తే విద్యార్థి చదువు పూర్తయి.. ఉద్యోగం సాధించే వరకు ఇదే నంబరు కార్డు ఉంటుంది. కేంద్రం జారీ చేస్తున్న అపార్ కార్డులో విద్యార్థికి సంబంధించిన పూర్తి స్థాయి వివరాలు అందులో నమోదై ఉంటుంది. శాశ్వత డిజిటల్ గుర్తింపు సంఖ్యతో దేశంలో ఎక్కడ చదవాలన్న ఉపాధి అవకాశాలకు సంబంధించి ఈ కార్డు కీలకం కానుంది.



మిగతా 4లో..

క్లబ్ రాజకీయాలు

- ఆలూరు కాస్మోపాలిటన్ క్లబ్ చుట్టూ రాజకీయ ఉచ్చు..!
- ఆధిపత్యం కోసం ఇద్దరు నేతల పట్టు

5

ఉల్లిని త్వరితగతిన కొనుగోలు చేయండి

- మార్కెట్ కమిటీ అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే గౌరు చరిత

చెత్తకుండీలో శిశువు మృతదేహం

5

ఆ 14 మందిని మళ్లీ విచారించండి

- ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపాలిటీల్లో అవినీతి 'మరుగు'దొడ్లు
- వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మాణంలో అక్రమాలు
- ఇంజనీర్లు, సిబ్బంది అక్రమాలు నిజమే అంటున్న ఆర్‌జేడీ నివేదిక



కర్నూలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులు పాపం చేస్తే వెంటాడుతూనే ఉంటుంది. ఎంత తప్పించుకోవాలని చూసినా సాధ్యం కాదు. మరుగుదొడ్ల నిర్మాణంలో అవినీతికి పాల్పడిన అధికారులపై తొమ్మిదేళ్లుగా విచారణ సాగుతూనే ఉంది. తాజాగా మరోసారి విచారణ జరపాలని మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అనిల్‌కుమార్ సింఘల్ మెమో జారీ చేశారు.

పారదర్శకంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన ప్రభుత్వ అధికారుల అవినీతి అక్రమాలు బదిలీ మీద వెళ్లిపోయినా ముగిసిపోవని చెప్పడానికి ఇది తాజా ఉదాహరణ. ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపాలిటీల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో జరిగిన అవినీతిపై దాదాపు తొమ్మిదేళ్లుగా విచారణ సాగుతున్నది. కమిషనర్లు తప్ప ఇంజనీర్లు, ఇతర సిబ్బంది అవినీతి అక్రమాలు వాస్తవమే అని మున్సిపల్ శాఖ ఆర్‌జేడీ ఇచ్చిన నివేదికపై మళ్లీ పద్నాలుగు మందిని విచారించాలని మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అనిల్‌కుమార్ సింఘల్ మెమో జారీ చేశారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు మరోసారి తమ వాదన వినిపించేందుకు అవకాశం కల్పించారు. ఈమేరకు మెమోలు జారీ చేశారు.

మిగతా 5లో..

మహిమాన్వితం... కార్తీకమాసం

- నేటి నుంచి ఆరంభం
- ముస్తాబైన వైష్ణవ, శైవ క్షేత్రాలు



ధార్మిక భావాల విడిదిగా, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వారధిగా నిలిచే కార్తీక మాసం శనివారం ఆరంభం కానుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని పుణ్యక్షేత్రాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి.

4లో..

ఉల్లి రైతు కంట కన్నీరు

- బస్తాల కింద నలిగిపోయిన ఉల్లిగడ్డలు
- క్వింటా రూ.4,500 నుంచి రూ.1,859 పడిపోయిన ధర


దిబ్బలా పేరుకపోయిన ఉల్లి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో పండగ పూట కూడా రైతులు కొనుగోలుదారుల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూడాల్సి వచ్చింది. గతంలో ఎన్నడూ లేనంతగా కర్నూలు మార్కెట్ యార్డులో దాదాపు 19వేల క్వింటాళ్ల ఉల్లి ఒక్కసారిగా అమ్మకానికి వచ్చింది. సర్వర్ పని చేయకపోవడంతో అవసరమైన తూకం వేసే కాటాలు లేకపోవడం, రవాణా చేసేందుకు లారీలు దొరక్కపోవడం తదితర కారణాలన్నీ ఉల్లి విక్రయంలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితిని నివారించేందుకు కలెక్టర్ పి. రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య తదితర అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు రాష్ట్ర ఉన్నతాధికారులతో మాట్లాడి ఈనామ్ సర్వర్ సమస్యను పరిష్కరించడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గత మూడు రోజుల నుంచి ఉల్లిగడ్డలు ఎప్పటికప్పుడు కొనుగోలు చేసేందుకు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, వ్యాపారులు, లారీ యజమానులతో సమావేశమై వెంటనే ఉల్లిని కొనుగోలు చేయించి బయటకు పంపించేందుకు ఏర్పాటు చేశారు. అయితే పచ్చి సరుకు కావడంతో బస్తాల కింద నలిగిపోయిన ఉల్లిగడ్డలను వ్యాపారులు కొనుగోలు చేయలేదు. దీంతో శుక్రవారం ధర భారీగా తగ్గిపోయింది. క్వింటం ఉల్లికి వారం కింద రూ.4,500 గరిష్ఠ ధర అందింది. శుక్రవారం నాణ్యత లేని కారణంగా క్వింటం ఉల్లికి గరిష్ఠ ధర రూ.1,859, మధ్యస్థ ధర రూ.1,000, కనిష్ఠ ధర రూ.495లు మాత్రమే రైతుకు దక్కింది. దాదాపు 20 నుంచి 30 శాతం దాకా ఉల్లికి డ్యామేజి జరగడంతో రైతులు దెబ్బతిన్న ఉల్లిగడ్డలను ఇంటికి తీసికెళ్లలేక మార్గమధ్యంలో పారబోస్తున్నారు. ఈ పరిస్థితి గతంలో తాము ఎప్పుడూ ఎదుర్కొలేదని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు.

టాలెంట్

ఆయన ఓ కళా ఖండం



కలంకారీ చిత్రకళాకారుడు శివప్రసాద్‌రెడ్డి

- కలంకారీ చిత్రాలకు దేశవ్యాప్తంగా ఆదరణ
- ఎన్నో అవార్డులు శివప్రసాద్‌రెడ్డి సొంతం

బనగానపల్లె, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సాధారణ రైతు కుటుంబంలో పుట్టి ఆయన రూపొందించిన కలంకారీ కళాఖండాలు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఆయన గీచిన కలంకారీ చిత్రాలు దేశవ్యాప్తంగా ప్రశంసలందుకున్నాయి. అప్పటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జి, ముఖ్యమంత్రులు ఎన్టీ రామారావు, నారా చంద్రబాబునాయుడు, జగన్‌మోహన్‌రెడ్డి నుంచి కూడా అవార్డులు అందాయి. బనగానపల్లె మండలం టంగుటూరు గ్రామానికి చెందిన శివప్రసాద్ రెడ్డి సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. చిన్నప్పుడు ఇంటి నుంచి పారిపోయిన ఆయన రాంభోజనాయక్ అనే వ్యక్తి నుంచి కలంకారీ విద్యను నేర్చుకున్నారు. దానిమ్మ చెక్కలు, కరక్కాయ, మోదుగ పువ్వు, నీలం ఆకు పటిక బెల్లం రంగరించగా వచ్చే రంగులతో వస్త్రాలపై కలంకారీ చిత్రాలు వేస్తున్నారు. ఇలా కలంకారీలో తనదైన ప్రత్యేకతను చాటుకుంటున్నారు.



కలంకారీ చిత్రం బుద్ధ చరిత్ర

కలంకారీ కళాఖండాలు

శివప్రసాదరెడ్డి కలంకారీ చిత్రకళకు నేటికీ జీవం పోస్తున్నారు. 40 అడుగుల పొడవు, 11 అడుగుల వెడల్పు ఉన్న వస్త్రంపై పొడవైన కళాఖండాన్ని రూపొందించారు. ఇందులో రామాయణం, మహాభారతం, భాగవతం, శ్రీనివాస కళ్యాణం, రావణ అనుగ్రహ, గ్రామీణ జీవనం దృశ్యాలను ఎంతో అందంగా ప్రతిభావంతంగా కళాత్మకంగా చిత్రించారు. అలాగే 50 చదరపు మీటర్ల వస్త్రంపై రెండు వేల చిత్రాలను ఒకే చోట వేసి కళాప్రియుల హృదయాలు దోచుకున్నారు. గౌతమ బుద్ధుని చరిత్రను ఒకే వస్త్రంపై చిత్రించి పలువురి ప్రశంసలు అందుకున్నారు. రాష్ట్రంలో ఇంతవరకు ఇటువంటి ప్రయోగాన్ని ఏకళాకారుడు చేయలేదని చెప్పవచ్చు.

కలంకారీ చిత్రకళకు అవార్డుల పంట

గత 35 ఏళ్లుగా కలంకారీ చిత్రాలను ప్రదర్శిస్తూ ఎన్నో అవార్డులను శివప్రసాద్‌రెడ్డి సొంతం చేసుకున్నారు. 1995లో జరిగిన పోటీల్లో బుద్ధుని చిత్రం వేసి దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామరావు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. 1996లో మహాత్మాగాంధీ బర్త్ సెంటినరీ మెమోరియల్ అవార్డును అప్పటి మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి పి.చిదంబరం చేతుల మీదుగా అందుకున్నారు. 2000లో లేపాక్షి ఏపీ హ్యాండి క్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా హనుమాన్ రామాయణం చిత్రాన్ని గీసి స్టేట్ అవార్డును దక్కించుకున్నారు. 2004లో యునెస్కో ఎక్స్‌లెన్సీ అవార్డును అందుకోవడంతోపాటు గిన్నిస్‌బుక్‌లో కూడా స్థానం సంపాదించుకున్నారు. 2007 రామాయణ, మహాభారతం చిత్రాలను 1926 చిత్రాలను రెండేళ్ల పది రోజుల్లో పూర్తి చేసి లిమ్‌కా బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించుకున్నారు. 2012లో హ్యాండి క్రాఫ్ట్‌లో భారత ప్రభుత్వం నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. 2014లో కలంకారీ శిల్ప గురు అవార్డును అప్పటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చేతుల మీదుగా అందుకున్నారు. అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నుంచి కళారత్న అవార్డును సొంతం చేసుకున్నారు. 2021లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నుంచి వైఎస్సార్ అచీవింగ్ అవార్డును అందుకున్నారు. అలాగే 2024న నవంబరు 23న దక్షిణభారతదేశ క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ హ్యాండ్లూమ్ ఇండియా వారు చెన్నైలో కమలాదేవి చటోపాధ్యాయ అవార్డును అందుకోనున్నారు.

పది మందికి పంచుతున్నా

కలంకారీ శివ ప్రసాదరెడ్డి రాంభోజనాయక్ ఎందరికో శిక్షణ ఇచ్చారు. ఆయన అడుగుజాడల్లో పలువురికి కలంకారీ విద్య నేర్పుతున్నా. ఆదాయంతో నిమిత్తం లేకుండా అనేక మంది యువకులకు శిక్షణ ఇస్తున్నా. గ్రామాల్లోనేగాక పట్టణాల్లో సైతం కళకు ఆదరణ ఉంటుంది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే కలంకారీ చిత్రకళను మరింత విస్తృతం చేస్తాం.

– శివప్రసాద్‌రెడ్డి, కలంకారీ కళాకారుడు



అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ నుంచి అవార్డు అందుకున్న శివప్రసాద్‌రెడ్డి (ఫైల్)



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నుంచి అవార్డు అందుకున్న శివప్రసాదరెడ్డి(ఫైల్)



అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు నుంచి అవార్డును అందుకున్న శివప్రసాద్‌రెడ్డి (ఫైల్)



శ్రీనివాస కల్యాణం కలంకారీ చిత్రం



రామాయణం, మహాభారతంలోని సన్నివేశాలు..

అవుకులో కొండచిలువ



ముళ్లపొదల్లో ఉన్న కొండచిలువ

అవుకు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అవుకు పట్టణం శివరామయ్య తోటలోని హౌసింగ్ కాలనీలో శుక్రవారం కొండచిలువ హల్‌చల్ చేసింది. ఉదయం 10 గంటల ప్రాంతంలో కాలనీలోని ఓ ఇంటి సమీపంలో ముళ్లపొదల్లో దాక్కున్న కొండచిలువ బయటకు వచ్చి కోడిని నోట కరచుకొని వెళ్లింది. కోడి అరుపులతో స్థానికులు పొదల్లో గాలించారు. కొండ చిలువ కోడిని మింగుతూ కనిపించటంతో ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. కొండచిలువ గంటసేపు ముళ్లపొదల్లోనే ఉండిపోయింది. అయినా ఫారెస్టు అధికారులు రావటం ఆలస్యం కావటంతో కొండచిలువ కనిపించకుండా పోయింది.

జస్ట్ మిస్..!



ఫ్లైఓవర్ రక్షణ గోడను ఢీకొట్టి అక్కడే నిలిచిపోయిన కారు

ఆదోని (అగ్రికల్చర్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణంలోని పాత ఫ్లైఓవర్ బ్రిడ్జి మీద ఘోర ప్రమాదం తప్పింది. శుక్రవారం ఉదయం ఆదోని నుంచి ఆలూరుకు వెళ్తున్న ఒక కారు అదుపుతప్పి ఫ్లైఓవర్ బ్రిడ్జి గోడను ఢీకొంది. దీంతో రక్షణ గోడ ఒక్కసారిగా కుప్పకూలిపోయి కిందకు పడింది. ఆ సమయంలో కింద అటుగా వెళ్లేవారు శబ్దానికి అప్రమత్తమై పక్కకు పరుగులు తీయడంతో ప్రమాదం తప్పింది. మరోవైపు కారు పై నుంచి కిందకు దూసుకువచ్చి పడిపోయి ఉంటే ఘోర ప్రమాదమే జరిగేది. కారులో ముగ్గురు ప్రయాణిస్తున్నారు. స్థానికుల సహాయంతో కారును బ్రిడ్జిపై నుంచి అతికష్టం మీద పక్కకు తీశారు.

విద్యార్థులకు అపార్ కష్టాలు

(3వ పేజీ తరువాయి)

ఆధార్ వివరాలల్లో పెద్ద ఎత్తున తప్పులు ఉన్నాయి. ప్రస్తుత్తం అపార్ కార్డు విద్యార్థులకు తప్పనిసరి కావడంతో ఆధార్‌లోని తప్పులను సరి చేయాల్సి ఉంటుంది. గ్రామీణ వాసులు సమీప పట్టణంలోని ఆధార్ కేంద్రాలకు వెళ్లి తప్పులను సరి చేసుకోవాల్సి ఉంటుంది. పాఠశాలలో అడ్మిషన్ రిజిష్టర్ ప్రకారం ప్రధానోపాధ్యాయులు సర్టిఫికెట్ ఇస్తే, ఆ వివరాల ప్రకారం ఆధార్ కేంద్రాల్లో మార్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఆధార్ వివరాల సవరణ బాధ్యత ప్రధానోపాధ్యాయులకు అప్పగిస్తే ప్రయోజనం ఉంటుంది. జిల్లా అధికారులు విద్యార్థుల ఆధార్ సమస్యలు పరిష్కరించేల్లా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తే అపార్ నమోదు మరింత వేగవంతమవుతుంది.

అపార్ నమోదైన విద్యార్థుల విరాలు

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 2251
విద్యార్థుల సంఖ్య వివరాలు 4,78,600
అపార్ నమోదైన వారి వివరాలు 1,59,600
అపార్ పూర్తైన నమోదు శాతం 32.50

అపార్ శరవేగంగా జరిగేలా చర్యలు



అపార్ నమోదు ప్రక్రియలో సమస్యలు ఉన్నాయి. ఒక్కొక్కటి పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తున్నాం. కమాండ్ కంట్రోల్ రూమ్, అపార్ కమిటీని పెట్టాం. ఏదైనా సమస్య వస్తే వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. అయినప్పటికీ రాష్ట్రంలోనే అపార్ నమోదులో కర్నూలు జిల్లాలో 32.50 శాతం పూర్తయి రాష్ట్రంలోనే 7వ స్థానంలో ఉన్నాం. నవంబరు 30వ తేదీ నాటికి పూర్తికి ప్రణాళిక సిద్ధం చేశాం. దీన్ని వేగవంతం చేసేందుకు డిప్యూటీ ఉప విద్యాశాఖ, మండల విద్యాశాఖ అధికారులకు సూచనలు చేశాం. ఇక నుంచి విద్యార్థికి సంబంధించిన సర్టిఫికెట్లు, ఉపకార వేతనాలు, క్రీడలు వంటి వ్యక్తిగత వివరాలు సాధించిన విజయాలతో పాటు అపార్‌లో నమోదై ఉంటాయి. చాలా మంది విద్యార్థులకు ఆధార్ జారీ చేసేటప్పుడు పుట్టిన సంవత్సరం, పేరు, చిరునామా వంటి వివరాల్లో తప్పులుంటే, అపార్ రిజిష్టర్ కావడం లేదు.

-జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శ్యామ్యూల్ పాల్, కర్నూలు

యురేనియంపై యుద్ధం ...



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు


- దేవాలయం వద్ద సమీపంలోని 11 గ్రామాల సమావేశం
- యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా ఐక్యపోరాటాలు

(3వ పేజీ తరువాయి)

యురేనియం తవ్వకాలతో అడవి నాశనమై పర్యావరణం ధ్వంసమైపోతుందని, నీరు కలుషితమవుతుందని, పంటలు పండవని, పొలాలు నాశనమైపోతాయని, అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. పచ్చని పల్లెల్లో యురేనియం తవ్వకాలు వద్దని, సేవ్ కౌలుట్లయ్య మల అంటూ పోస్టర్లతో పలు గ్రామాలకు చెందిన యువకులు ఆందోళన చేశారు. అటవీప్రాంతంలో యురేనియం కోసం బోర్లు వేసేందుకు వస్తే అడ్డుకుంటామన్నారు. తమ ప్రాణాలకు, పంట పొలాలకు హానీ కలిగించే యురేనియం తవ్వకాల నిర్ణయాన్ని ప్రభుత్వాలు వెనక్కి తీసుకోవాలని కోరారు. లేకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని పలు రాజకీయ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు అన్నారు. కప్పట్రాళ్ల సర్పంచు చెన్నమనాయుడు, టీడీపీ మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్‌గౌడ్, కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మల్లికార్జున, వైసీపీ నాయకులు దివాకర్‌నాయుడు, సీపీఎం వీరశేఖర్, సీపీఐ వెంకటేశ్వరరెడ్డి, వెంకటస్వామిగౌడ్, సర్పంచు మహేశ్వరరెడ్డి, కోటకొండ సర్పంచు భర్త లింగన్న, మహిళలు, యువకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పి. కోటకొండలో రోడ్డు దిగ్బంధం: పి. కోటకొండకు వచ్చే వాహనాలను అడ్డుకొని గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. యురేనియం తవ్వకాలతో తమ బతుకులు నాశమైతామని ఆందోళన వ్యక్తం చేసి రోడ్డుపై అడ్డంగా బండరాళ్లని అడ్డుపెట్టారు. పోలీసులు జోక్యం చేసుకొని రోడ్డుపై బండరాళ్లని తొలగించారు.

గామా కిరణాలు వెలువడుతాయి



యురేనియం తవ్వకాలతో గామా కిరణాలు వెలువడి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. యురేనియం తవ్వకాలతో అక్కడ ఉన్న ఆలయాలు ధ్వంసమవుతాయి. పంటలు పండక, ప్రజలకు వ్యాధులబారిన పడి తీవ్ర నష్టం జరుగుతుంది.

-రవిశర్మ, కప్పట్రాళ్ల

యురేనియం తవ్వకాలు నిలిపేయాలి



గతంలో ఫ్యాక్షన్‌తో మా జీవితాలు నాశనమై ఇప్పుడిప్పుడే మెరుగుపడుతున్నాయి. ఈ తరుణంలో యురేనియం తవ్వకాలంటూ ప్రశాంతత లేకుండా చేస్తున్నారు. ప్రభుత్వాలు తవ్వకాలు ఆపేయాలి.

-కర్రెక్క, పి. కోటకొండ

25 గ్రామాలు నష్టపోతాయి



యురేనియం తవ్వకాలతో చుట్టు 25 గ్రామాలు తీవ్రంగా నష్టపోతాయి. వాతావరణ కాలుష్యంతో ప్రజల మనుగడ కష్టమవుతుంది. ఈ తవ్వకాలు జరపకుండా ప్రభుత్వాలు చూడాలి.

-కప్పట్రాళ్ల బొజ్జమ్మ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి

భూములు నాశనం అవుతాయి



యురేనియం తవ్వకాలతో మా భూములు నాశనమైపోతాయి. తవ్వకాల భయంతో ప్రజలు వణికిపోతున్నారు. ఫారెస్టులో యురేనియం వెలికి తీయాలనే ఆలోచనలు మానేయాలి.

-నాగభూషణం రెడ్డి, పి. కోటకొండ

నగర పాలక సంస్థ ఉద్యోగులకు మెమో జారీ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాలయంలో సమయ పాలన పాటించని 59మంది అధికారులు, ఉద్యోగులకు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు మెమో జారీ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో భోజనానికి వెళ్లేముందు మూమెంట్ రిజిస్టర్‌లో సంతకాలు పెట్టనందుకు 32మందికి, భోజనం అయ్యాక మూమెంట్ రిజిస్టర్‌లో 3.15 గంటల తర్వాత సంతకాలు పెట్టిన మిగిలిన 27 మందికి మెమో జారీ చేశారు. కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల మీద అధికారులు, ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కనీసం ముందస్తు సమాచారం లేకుండా మెమో ఇవ్వడం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 10 గంటలకు కార్యాలయానికి వచ్చి సాయంత్రం 5.30 గంటలకు వెళ్లిపోతామని కొందరు అధికారులు, ఉద్యోగులు భీష్మించారు. కమిషనర్ తీసుకున్న నిర్ణయంపై కొందరు అధికారుల, ఉద్యోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

మహిమాన్వితం... కార్తీకమాసం

- నేటి నుంచి ఆరంభం
- ముస్తాబైన విష్ణు, శైవ క్షేత్రాలు

కర్నూలు కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ మాసం శివ కేశవులకు అత్యంత ఆరాధ్య పూర్వక మాసం కావడంతో భక్తులు నిత్యం పూజలకు సిద్ధమయ్యారు. అలాగే ఉభయ సంధ్యావేళల్లో దీప, ధూప, నైవేద్య, పూజాదికార్యక్రమాలు, నదీస్నానాలు, ఉపవాసాలు ఆచరిస్తూ ధార్మిక జీవన మార్గాన్ని అనుసరిస్తున్నారు. కార్తీక మాసం ఆరంభం అవుతూనే అయ్యప్ప భక్తులు మాలధారణ కార్యక్రమాన్ని ప్రారంభించి ఒక పూట భోజనంతో ఉపవాసాలు పాటిస్తున్నారు. ఆధ్యాత్మిక పరంగా ఉపవాస దీక్షల వల్ల మనోశక్తి పెరగడంతోపాటు, మనసుకు ప్రశాంతత వచ్చి చేకూరుతుంది. ఇక ఆరోగ్య శాస్త్ర పరంగానూ శరీరానికి మితంగా ఆహారం అందుతుంది. మితాహారం వల్ల జీర్ణశక్తి పెరుగుదలతో పాటు, చురుకుదనం, శరీరంలోని మలినాలు శుభ్రం కావడం, జ్ఞాపక శక్తి పెరుగుతుందని ఆహార నిపుణులు సూచిస్తున్నారు. చలి కాలంలో ఒక పూట మాత్రమే ఆహారం తీసుకొని, మిగతా రెండు పూటలా ఎలాంటి ఆహారం తీసుకోకుండా పాటించే ఉపవాస దీక్షకు ఎంతో ప్రాధాన్యత ఉంది.



విద్యుద్దీప కాంతుల్లో శ్రీశైల మల్లికార్జున స్వామి ప్రధాన రాజగోపురం

అమరవీరుల త్యాగాలు గొప్పవి

ఎస్పీ జి.బిందుమాధవ్



కర్నూలు క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు గొప్పవని ఎస్పీ జి.బిందుమాధవ్ అన్నారు. గురువారం రాత్రి జిల్లా పోలీసు కార్యాల యంలోని పరేడ్ మైదానంలో అమరవీరుల స్థూపానికి పోలీసులు నివాళులర్పించారు. అనంతరం పోలీసు అమరవీరులను స్మరిస్తూ కొండారెడ్డి బురుజు వద్ద పోలీసులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలి: మంత్రి



ట్రాఫిక్ విభాగాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బీసీ, ఎస్పీ రాణా

బనగానపల్లె, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణ జనాభా రోజు రోజుకూ పెరిగిపోతున్నందున ట్రాఫిక్ నియంత్రణకు అందరూ సహకరించాలని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి పిలుపునిచ్చారు. దీపావళి పండుగ రోజు గురువారం డోన్ డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణాతో కలసి ట్రాఫిక్ అవుట్ పోస్టును ప్రారంభించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ట్రాఫిక్ పోలీస్‌లకు ప్రత్యేక గదిని మంత్రి బీసీ, ఎస్పీ ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్‌ను నియంత్రించి ప్రజలు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారన్నారు. డోన్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు మంజునాథరెడ్డి, కృష్ణయ్య, వెంకటేశ్వరరావు, ఎస్ఐ దుగ్గిరెడ్డి పాల్గొన్నారు.

చెత్తకుండీలో నవజాత శిశువు మృతదేహం



అంత్యక్రియలు నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

• ఆదోనిలో దారుణం

ఆదోని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చెత్తకుండీలో శిశువు మృతదేహం.. సంచిలో ఉన్న మృతదేహాన్ని కుక్కలు పీక్కుతింటుంటే స్థానికులు గమనించారు. ఆదోని పట్టణంలోని వడ్డెగేరిలో ఈ దారుణం చోటు చేసుకుంది. రెండు రోజుల మగ శిశువు మృతదేహాన్ని తీసుకొచ్చి చెత్త కుప్పలో గుర్తుతెలియని వ్యక్తులు పడేశారు. కాలనీవాసులు మున్సిపల్ సిబ్బందికి సమాచారం అందించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో ఆధారాలు తెలియడం లేదు. పుట్టిన పసికందు మృతదేహాన్ని ఇలా చెత్తలో ఎవరు పడేసిందీ తెలియడం లేదు. ఈ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది.

ఉల్లిని త్వరితగతిన కొనుగోలు చేయండి

• పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత



మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో రైతులు తెచ్చిన ఉల్లిని ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి, బయటకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మార్కెట్ కమిటీ అధికారులను ఆదేశించారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గురువారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి యార్డుకు వచ్చి పరిశీలించారు. నాలుగైదు రోజులుగా తమ ఉల్లిగడ్డలను వ్యాపారులు కొనుగోలు చేయడం లేదని, పండుగ పూట కూడా యార్డులోనే ఉండాల్సిన పరిస్థితి దాపురిస్తుందని రైతులు వాపోయారు. ఎందుకు ఉల్లి కొనుగోళ్లలో ఆలస్యం జరుగుతుందో మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో వ్యాపారులు, ట్రాన్స్‌పోర్టు యజమానులతో అధికారులతో ఎమ్మెల్యే సమావేశాన్ని నిర్వహించారు. ఈనామ్ సర్వర్‌లో చోటు చేసుకున్న ఇబ్బందుల వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని, వెంటనే ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరించామన్నారు. భవిష్యత్తులో ఎటువంటి ఆటంకాలు ఎదురైనా నష్టం లేకుండా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఉల్లిని కొనుగోలు చేస్తున్న వ్యాపారులు లారీల యజమానులతో ఎప్పటికప్పుడు సమావేశమై రైతులు తెచ్చే పంట ఉత్పత్తులను సత్వరం కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, సల్కాపురం దేవేంద్రరెడ్డి, పెద్దపాడు పెద్ద బీచుపల్లి, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటిస్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు రూరల్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కర్నూలు ఆర్టీసీ జోనల్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ నజీర్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులైన వారు ఈనెల 5నుంచి 19లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య జిల్లాల్లో ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. ప్రధానంగా డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, మెషనిస్ట్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ట్రేడ్‌లు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. వివరాలకు 08518-257025 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ఆర్టీసీ బస్సులో వలస కూలీ మృతి

సి. బెళగల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో వలస కూలీ మృతి చెందాడు. ఈ ఘటన కర్నూలు బస్టాండ్‌లో శుక్రవారం చోటు చేసుకున్నది. సి. బెళగల్‌కు చెందిన కత్తి మల్లేష్ (39) తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లాకు వారం క్రితం పత్తి తీయడానికి వలస వెళ్లాడు. శుక్రవారం సి. బెళగల్‌కు రావడానికి నల్గొండలో బస్సు ఎక్కి కర్నూలుకు వచ్చాడు. తీరా కర్నూలులో ప్రయాణికులందరు బస్సు దిగిపోయారు. మల్లేష్ మాత్రం సీట్లులోనే నిద్రలో ఉన్నట్లు ఉండగా, డ్రైవర్, కండెక్టర్ లేపినా లేవలేదు. అనుమానంతో శ్వాస చూడగా లేకపోవడంతో మృతి చెందినట్లు నిర్ధారించారు. గుండెపోటుతో మృతి చెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి జేబులోని ఆధార్‌కార్డుపై ఉన్న నెంబర్‌కు ఫోన్ చేసి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతుడికి భార్య హనుమక్క, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

క్లబ్ రాజకీయాలు



మూతపడిన ఆలూరు కాస్మోపాలిటన్ క్లబ్

- ఆలూరు కాస్మోపాలిటన్ క్లబ్ చుట్టూ రాజకీయ ఉచ్చు..!
- ఆధిపత్యం కోసం ఇద్దరు నేతల పట్టు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా క్లబ్ మారిందంటూ ఫిర్యాదు
- తాళాలు వేసిన పోలీసులు

ఆలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆలూరు పట్టణంలోని కాస్మోపాలిటన్ క్లబ్‌పై పట్టు కోసం ఇద్దరు అధికార పార్టీకి చెందిన నేతలు ప్రయత్నిస్తున్నారు. ఈనెల 3న నూతన కార్యవర్గం ఎంపికకు సమావేశం నిర్వహించాలని క్లబ్ అధ్యక్షుడు మాజీ మంత్రి సోదరుడు గుమ్మనూర్ జయరాం సోదరుడు శ్రీనివాసులు నిర్ణయం తీసుకున్నారు. బుధవారం క్లబ్ సభ్యులు, త్రీ సభ్య కమిటీ సభ్యులు ఆయనను కలిసి క్లబ్ సమావేశంపై చర్చించారు.

ఆలూరు కాస్మోపాలిటన్ క్లబ్‌లో సభ్యత్వం ఉండాలంటే బడా నేతల సిపారసు అవసరం. గతంలో ఎన్నో ఏళ్లుగా ఈ క్లబ్ అధ్యక్షులుగా రిటైర్డ్ ఉద్యోగులు మాత్రమే వుండేవారు. ఆ తర్వాత రాజకీయ పలుకుబడి ఉన్న వాళ్లకే చైర్మెన్ అవకాశం దక్కుతూ వస్తున్నది. గతంలో మాజీ మంత్రి మూరెప్ప, మాజీ ఎమ్మెల్యే మసాల ఈరన్న, మాజీ కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ వైకుంఠం శ్రీరాములు, టీడీపీ నేత కుమార్ గౌడ్ కనుసన్నల్లో క్లబ్ కార్యవర్గం ఉండేది. ఆ తర్వాత ఎవరు ఎమ్మెల్యే అయితే వారిదే క్లబ్‌పై ఆధిపత్యం కొనసాగింది. గత వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న జయరాం సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు, జడ్పీటీసీ సభ్యుడు ఎరూరు శేఖర్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులుగా కొనసాగారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో క్లబ్ కార్యవర్గాన్ని రద్దు చేసి త్రీమెన్ కమిటీను నియమించారు. ప్రస్తుతం అధికార పార్టీ నుంచి గుంతకల్ ఎమ్మెల్యేగా ఉన్న గుమ్మనూరు జయరాం సోదరుడు శ్రీనివాసులు క్లబ్‌పై పట్టు సాధించి తమకు అనుకూలమైన వారికి పదవులు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఆలూరు మాజీ టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం శివ ప్రసాద్ సైతం క్లబ్ కార్యవర్గాన్ని ఇప్పట్లో నిర్వహించవద్దని పట్టుబడుతున్నారు. అధికారికంగా ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి ప్రకటన అనంతరం కొత్త బాడీను ఎన్నిక చేసుకోవాలని తేల్చి చెబుతున్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల ఇబ్బందులు

ఆలూరు పట్టణంలో ఉన్న ఒకే ఒక క్లబ్‌కు రాజకీయ రంగు పులిమి తాళాలు వేయించడంతో రిటైర్డ్ ఉద్యోగులు కనీసం ఉదయం పేపర్ చదువుకొనే అవకాశం లేకుండా పోయింది. ప్రతి రోజూ క్లబ్‌కు వచ్చి పేపర్ చదువుకొని, క్యారమ్స్ ఆడి కాలక్షేపం చేసేవాళ్లమని అంటున్నారు. పోలీసులు, ఉన్నత అధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

క్లబ్‌కు తాళం

ఎంతో చరిత్ర ఉన్న ఆలూరు కాస్మోపాలిటన్ క్లబ్ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని, క్లబ్‌ను మూసివేయాలని ఆలూరు మాజీ టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం శివప్రసాద్ రెండు రోజుల క్రితం ఆలూరు ఎస్ఐ వెంకట నరసింహులును కలిసి ఫిర్యాదు చేశారు.. క్లబ్‌లో మద్యం సేవించినట్లు ఆధారాలను కి చూపించారు. అందువల్ల క్లబ్‌ను మూసివేయాలని ఎస్ఐకి పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్యకు ఫోన్ చేయడంతో ఆలూరు పోలీసులు తాళాలు వేశారు.

ఆ 14 మందిని మళ్లీ విచారించండి

(3వ పేజీ తరువాయి)

2014-25లో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా నాటి టీడీపీ ప్రభుత్వం పెద్దఎత్తున వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఈ పథకం అమల్లో మున్సిపాలిటీ పట్టణాల్లో డ్వాక్రా సంఘాలు, మెప్మా అధికా రులను కూడా భాగస్వాములను చేశారు. ఇదే అదనుగా భావించి మున్సిపల్ కమిష నర్లు సహా ఇంజనీర్లు, మెప్మా అధికారులు రాజకీయ నాయకులతో కుమ్మక్కై మరుగు దొడ్లు నిర్మించకుండానే నిర్మించినట్లు బిల్లులు చేసి భారీగా నిధులు స్వాహా చేశారనే ఆరోప ణలు అప్పట్లో వచ్చాయి. దీంతో ఆనాటి ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం



ఎమ్మినూరు పురపాలక సంఘం కార్యాలయం

అధికారులతో విచారణ చేయిం చింది. ఆదోని మున్సిపాలిటీ పరిధిలో మూడు దశల్లో నిర్మించిన 2,623 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో జరిగిన అవినీతిపై విజిలెన్స్ అధికారులు విచారణ చేశారు. తొలి దశలో 776 మరుగుదొడ్లకు మార్గదర్శకాలు పాటించకుండానే, ఎంబుక్ రికార్డు చేయకుం డానే చెల్లింపులు చేశారని గుర్తించారు. అంతే కాకుండా లబ్ధిదారుల నుంచి సమ్మతి లేఖ తీసుకోవడంలోనూ మార్గదర్శకాలు పాటించలేదని గుర్తించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం కోసం ఆనాటి కమిషనర్ ప్రత్యేక బ్యాంక్ ఖాతాను ఏర్పాటు చేయకుండా.. ఎస్ఎల్ఎఫ్ఎస్(డ్వాక్రా మహిళా సమాఖ్య)ల ఖాతాలకు బదిలీ చేసినట్లు గుర్తించారు.

మహిళా సమాఖ్యల్లో కమిషనర్ ఆన్‌లైన్ ద్వారా జమ చేసిన రూ.2.02 కోట్లు డ్రా చేసి వార్డు కౌన్సిలర్లకు అందజేస్తే.. వారు లబ్ధిదారులకు పూర్తిగా చెల్లించకుండా కొంత వరకు చెల్లించి స్వాహా చేశారని ప్రధాన ఆరోపణ. మహిళా సమాఖ్యలు కూడా మార్గ దర్శకాలను వక్రీకరించారని గుర్తించారు. ఎమ్మిగనూరు పట్టణంలో కూడా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ర్యాండ మ్‌గా 80 మరుగుదొడ్లను తనిఖీ చేశారు. ఇంజనీర్లు ఎంబుక్ రికార్డులు చేసినా.. గతంలో ఎప్పుడో నిర్మించిన పాత మరుగుదొడ్లకు ఎంబుక్ రికా ర్డులు చేసి నిధులు పక్కాదారి పట్టించారని గుర్తించారు. ఐహెచ్‌హెచ్ఎల్ నిబంధనలు ప్రకారం కొలతలు కూడా లేవు. వీటిని పరిశీలించకుండానే ఆప్పటి కమిషనర్ చెల్లింపులు చేశారు. నిర్దేశిత పరిమాణం పాటించలేదని విచారణలో నిగ్గుతేల్చారు.

విజిలెన్స్ అధికా రులు ఇచ్చిన రిపోర్ట్ మేరకు మున్సిపాలిటీ శాఖ ఉన్నతా ధికారులు ఆ శాఖ అనంతపురం ఆర్‌జేడీని శాఖ పరమైన విచారణకు (డిపార్ట్‌మెంట్ ఎన్‌క్వయిరీ) ఆదేశించారు. అయితే.. ఈ భాగోతంలో మున్సిపల్ కమిషనర్ల పాత్ర నిర్ధారణ కాలేదని, ఇంజనీర్లు, ఇతర విభాగాల సిబ్బంది పాత్ర నిర్ధారణ అయ్యిందని ఆర్‌జేడీ ఇచ్చిన నివేదికపై స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సంతృప్తి చెందలేదని తెలుస్తున్నది. దీంతో అరోపణలు ఎదుర్కొంటున్న 14 మంది అధికారులు, సిబ్బందికి తమ వాద నలు విపించేందుకు మరో అవకాశం కల్పి స్తూ గత నెల 29న మెమో జారీ చేశారని మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగఫలితమే ఆంధ్ర రాష్ట్రం



పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఈవో, అధికారులు, ఉద్యోగులు

జిల్లా పరిషత్ సీఈవో జి.నాసరరెడ్డి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు త్యాగఫలితం వల్లే ఆంధ్రరాష్ట్రం ఏర్ప డిందని జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి అన్నారు. శుక్రవారం జడ్పీలోని మినీ సమావేశభవనంలో 68వ ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో భాషా ప్రతిప దికన ఏర్పడిన తొలి రాష్ట్రం ఆంధ్ర రాష్ట్రమన్నారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో తమకు అన్యాయం జరుగుతోందంటూ నినదించిన పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదన్నారు. అంతటి గొప్పవ్యక్తిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారులు నరసృతమ్మ, జితేంద్ర, పుల్లయ్య, నాగేంద్రప్రసాద్, నాగరాజు, ఉద్యోగులు, తిరుమలేశ్వరరెడ్డి, సిద్ధారెడ్డి, సురేష్, పుష్పావతి, మాధవి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు అందుబాటులో అన్సర్ జ్యువెలర్స్





మాట్లాడుతున్న మంత్రి ఫరూక్, విజేత మహమ్మద్ రఫీకి కారు అందజేస్తున్న అన్సర్ జువెలర్స్ అధినేతలు అన్సర్, అమీర్

లక్కీ విజేత ఎంపికలో మంత్రి ఫరూక్

నంద్యాల కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సామాన్యప్రజలకు అందుబాటులో కిస్నా డైమండ్స్ అన్సర్ జ్యువెలర్స్ సంస్థ ఉందని మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని సౌజన్య ఫంక్షన్ హాలు ప్రాంగణంలో అన్సర్ జ్యువెలర్స్ అధినేతలు అన్సర్, అమీర్ బ్రదర్స్ ఆధ్వ ర్యంలో కిస్నాడైమం డ్స్ లక్కీ డిప్ కార్యక్ర మం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి మా ట్లాడుతూ ఒకప్పు డు పెద్ద పట్టణాలలో మాత్రమే డైమండ్స్ ఆర్నమెంట్స్ అమ్మేవా రన్నారు. ప్రస్తుతం నంద్యాలలో అన్సర్ జువెలర్స్ సహకారంతో కిస్నా డైమండ్స్ లభించడం అభినందనీయమన్నారు. అన్స ర్ జ్యువెలర్స్ అధినేత అన్సర్ మాట్లాడుతూ తమ వద్ద రూ.5వేల నుంచి లక్షల రూపాయల వరకు డైమండ్, బంగారు ఆభరణాలు లభిస్తాయన్నారు. గత నెలలో ఏర్పాటుచేసిన గ్రాండ్ అన్సర్ జువెలర్స్- కిస్నా డైమండ్స్ ఎగ్జిబిషన్‌లో దాదాపు రూ.4 కోట్లకు పైగా వ్యాపారం జరిగిందన్నారు. అప్పుడు తమ వద్ద కొన్న కస్టమర్స్ లక్కీ కూపన్లు ఇచ్చామన్నారు. అనంతరం మంత్రి లక్కీ డిప్ ద్వారా విజేతను ఎంపిక చేశారు. నంద్యాలకు చెందిన మహమ్మద్‌రఫి (కూపన్ నెంబర్ 2110) అనే వ్యక్తి లక్కీడ్రాలో కారు బహుమతి గెలుచుకున్నాడు. విజేతకు కారును అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్కిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కిస్నా డైమండ్ రాయలసీమజోన్ ఇన్‌చార్జి మహబుబ్, విశ్వనాథరెడ్డి, చలంబాబు, కిస్నా డైమండ్స్ అన్సర్‌జ్యువెలర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

క్రైమ్ న్యూస్





అనిల్ కుమార్, చిన్నమునిస్వామి(ఫైల్)

వెల్దుర్తి, నవంబరు (ఆంధ్రజ్యోతి) 1: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన ఘటన శుక్రవారం వెల్దుర్తి మండలంలో చోటు చేసుకుంది. సి. బెళగల్ మండలం కొండాపురం గ్రామానికి చెందిన అనిల్ కుమార్ (32), చిన్నమునిస్వామి(39) బావా బావమరదులు.

అనిల్ కుమార్ సీఆర్పీఎఫ్ పోలీసుగా మణిపూర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన భార్యాపిల్లలు వెల్దుర్తిలో ఉంటున్నారు. సెలవుపై వెల్దుర్తికి వచ్చి పదిరోజులైంది. చిన్నమునిస్వామి నం ద్యాల జిల్లా డోన్‌లో నివసిస్తున్నాడు. విజ్ఞాన్ హైస్కూల్‌లో హెచ్ఎంగా పనిచేస్తున్నారు. వీరిరువురూ గురువారం టపాసులు తేవడానికి కర్నూలుకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వెల్దుర్తికి వస్తుండగా అల్లుగుండు స్టేజ్ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న డివైడర్ (ఇనుపరాడ్లు)ను బలంగా ఢీ కొట్టింది. హెల్మెట్‌లు లేకపోవడంతో ఇద్దరి తలలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. రాత్రి 9 గంటల సమయంలో కుటుంబసభ్యులు ఫోన్ చేస్తే రిప్లై లేక ఆందోళనకు గురయ్యారు. ఉదయం పాదయాత్ర చేస్తున్న అయ్యప్ప స్వాములు పోలీసులకు సమాచారం చేరవేశారు. అనిల్ కుమార్ భార్య సువర్ణమ్మ, చిన్నముని స్వామి భార్య వాణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనిల్ కుమార్‌కు, చిన్నమునిస్వామికి ఇద్దరు సంతానం ఉన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు


డైట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రోగులు, గర్భిణులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే. వెంకటేశ్వర్లు డైట్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం ఆయన హాస్పిటల్‌లో రౌండ్స్ నిర్వహించారు. న్యూరో సర్జరీ విభాగంలో ఆపరేషన్ థియేటర్‌లో ఏసీలు పని చేయక పోవడంపై ఆరా తీశారు. ఏసీలను తక్షణమే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఆసుపత్రిలో శానిటేషన్, సెక్యూరిటీ పనితీరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. త్వరలో రోగులకు సంబంధించి విజిటింగ్ పాసులను అందుబాటులోకి తీసుకుని రానున్నట్లు తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు ఐడీ కార్డు, డ్రెస్ కోడ్ పాటించాలని ఆదేశించారు. నర్సింగ్ సిబ్బంది, ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వో, పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బంది ఏయే విభాగాల్లో పని చేస్తున్నారో వారి డ్యూటీ రోస్టర్‌ను ప్రతి నెలా అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బీవీ రావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి.హేమనళిని, ఏడీ రమేష్ బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయి పాల్గొన్నారు.

మళ్లీ విధుల్లో చేరిన సూపర్‌వైజర్లు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ ఇద్దరు సెక్యూరిటీ సూపర్‌వైజర్లు మళ్లీ విధుల్లో చేరడం వివాదాస్పదంగా మారింది. ఇద్దరు సూపర్‌వైజర్లపై ఓ మహిళా సెక్యూరిటీ గార్డు స్పందనలో ఫిర్యాదు చేయగా.. కలెక్టర్ ఆదేశాల మేరకు అప్పటి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డి త్రిసభ్య విచారణ కమిటీని నియమించారు. ఈ కమిటీ నెల రోజులు విచారణ చేసి జనవరి 6న నివేదిక సమర్పించారు. ఆ ఇద్దరు సూపర్‌వైజర్లను తొలగించాలని, వారి వల్ల కార్మికులు ఇబ్బందులు పడ్డారని నివేదిక ఇచ్చారు. కాని శనివారం ఉదయం ఉన్నట్టుండి ఆ ఇద్దరు మళ్లీ విధుల్లో చేరారు. అసలు ఈ ఇద్దరిని విధుల్లో చేరడానికి ఎవరు అనుమతి ఇచ్చారో తెలియదు. త్రిసభ్య విచారణ కమిటీ జనవరిలో విచారణ చేసిన కమిటీలో ప్రస్తుతం కొత్తగా విధుల్లో చేరిన ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉండటం విశేషం. ఈవిషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ కే.వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. ఇద్దరు సూపర్‌వైజర్లు చేరిన విషయం తన దృష్టికి రాలేదన్నారు.

పరీక్ష వాయిదా

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈనెల 3న జరగాల్సిన ఉచిత మెగా డీఎస్సీ స్క్రీనింగ్ టెస్టును వాయిదా వేసినట్లు సాంఘిక సంక్షేమ జాయింట్ డైరెక్టర్ రంగలక్ష్మీదేవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరిగి పరీక్షను ఈ నెల 10న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డీస్సీ ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు గమనించాలని ఆమె తెలిపారు.

టీడీపీతోనే పేదలకు భరోసా: గౌరు చరిత

కల్లూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీతోనే పేద ప్రజలకు భరోసా సాధ్యమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 20వ వార్డులోని ధ్యానప్రియ హోటల్ సమీపంలో ఆమె పాల్గొని ఎన్టీ ఆర్‌భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ దీపావళి నుంచి పేదలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని అన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ పెరుగు పురుషోత్తంరెడ్డి, వార్డ్ ఇన్‌చార్జి పల్లె రఘునాథ్‌రెడ్డి, వంగాల జనార్ధన్ రెడ్డి, శ్రీకాంత్, లక్ష్మన్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

హామీలన్నీ నేరవేర్చుతాం: దస్తగిరి

గూడూరు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నేరవేర్చుతామని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శుక్రవారం గూడూరులో ఎమ్మెల్యే ఇళ్ల దగ్గరకే వెళ్ళి మహిళలకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ నగర పంచాయతీ వైస్ చైర్మన్ కె రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు, రేమట వెంకటేష్, సృజన్, పౌలు, దండు సుందరరాజు పాల్గొన్నారు.

దీపం పథకం మహిళలకు వరం: ఎమ్మెల్యే

గూడూరు నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దీపం పథకం మహిళలకు ఓ వరమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. దీపావళి కానుకగా శుక్రవారం గూడూరులో దీపం - 2 ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఇళ్ల దగ్గరకే వెళ్ళి మహిళలకు గ్యాస్ సిలిండర్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామన్నారు. కార్యక్రమంలో మాజీ నగర పంచాయతీ వైస్ చైర్మన్ కె రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు, రేమట వెంకటేష్, సృజన్, పౌలు, దండు సుందరరాజు, నాగప్ప యాదవ్, కె.విజయ్ కుమార్, తెలుగు శ్రీను, పెద్ద చాంద్ బాషా, కౌన్సిలర్లు బుడ్డంగలి, షాషావలి, చెంచుల విజయ్ కుమార్, మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్ బాబు, పెంచికలపాడు కృష్ణ, ఎంపీటీసీ మద్దిలేటి, అక్కలదేవి గిడ్డయ్య పాల్గొన్నారు.


గూడూరులో ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి


ఓర్వకల్లులో మహిళలకు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

మహిళా అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం: టీడీపీ

ఓర్వకల్లు: మహిళా అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఓర్వకల్లులోని సచివాలయంలో దీపం- 2 ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో శ్రీనివాసులు ప్రారంభించారు. ఎంపీటీసీ రంగనాథగౌడు, టీడీపీ సీనియర్ నాయకుడు సుధాకర్ రావు, ఈవోఆర్డీ సుబ్బరాయుడు, ఆర్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జడ్పీ సీఈవో, అధికారులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం ఏక్తాదివస్ (సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి) పురస్కరించుకుని చివరిరోజు 2వ పటాలం బెటాలియన్ నుంచి కొండారెడ్డి బురుజు వరకు శాంతి ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు ఎస్.మహబూబ్‌బాషా, ఐ.సుధాకర్‌రెడ్డి, డీఎస్పీలు షర్ఫుద్దీన్, డి.వెంకటరమణ, దళపతి కే.ప్రభుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా పరిషత్ మిని సమావేశ భవనంలో జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పరిపాలన అధికారులు సరస్వతమ్మ, జితేంద్ర, ప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు ప్రాధాన్యం కల్పించాలి: సోమిశెట్టి


మాట్లాడుతున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

కర్నూలు అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులకు ప్రభుత్వ పదవుల్లో అవకాశం కల్పించాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఆర్యవైశ్యులు వ్యాపారాలు చేసుకోలేక ఇబ్బందులు పడ్డారని, చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు తమకు న్యాయం చేయాలని కోరారు.

ఆంజనేయస్వామికి అమావాస్య పూజలు

ఓర్వకల్లు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్ముచెరువు, కాల్వ, భైరాపురం గ్రామాల్లో వెలసిన ఆలయాల్లో శుక్రవారం అమావాస్య పురస్కరించుకొని భక్తులు పూజలు చేశారు. కొమ్ముచెరువు ఆంజనేయస్వామి ఆలయానికి జిల్లాలోని వివిశ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారికి ఆకుపూజలు, నాగులపుట్టకు ప్రత్యేక పూజలు చేశారు.

కల్లూరు: సూర్యనారాయణస్వామి ఆలయంలో అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో ఆంజనేయస్వామికి అభిషేకం, అర్చన, ఆకుపూజలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం నవగ్రహ, లక్ష్మీగణపతి, మూలమంత్ర సహిత చండీహోమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు డి. లక్ష్మీనరసింహ శర్మ ఆధ్వర్యంలో భక్తులు విశేష పూజలు, హోమాలు నిర్వహించారు.

గుంతలు లేని రహదారులు నిర్మిస్తాం: ఎస్ఈ

కర్నూలు అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఏపీ కార్యక్రమం ద్వారా గుంతలు లేని రహదారులు నిర్మిస్తామని అర్ అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని మౌర్యఇన్ హోటల్ సమీపంలోని ఐదు రోడ్ల కూడలిలో నిర్మాణ పనులను పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ప్రారంభిస్తారని తెలిపారు. మొదటి దశలో 69 పనులను రూ.11.16 కోట్లతో 412.15 కి.మీ గుంతల రహదారుల నిర్మాణ పనులను చేపట్టనున్నామని, రెండో దశలో 171 పనులను రూ. 8.71 కోట్లతో 426.55 కి.మీ గుంతలు, ముళ్ల కంపలు లేని రహదారులను డిసెంబరు 31లోపు పూర్తి చేయనున్నామని తెలిపారు.

పండ్లతోటల పరిశీలన

సి.బెళగల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనగండ్ల, పోలకల్లు, సిబెళగల్, బ్రాహ్మణదొడ్డి గ్రామాల్లోని పండ్లతోటలను శుక్రవారం కోడుమూరు ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌గౌడు పరిశీలించారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ఇందిరమ్మ

కర్నూలు అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇందిరా గాంధీ నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపారని డీసీసీ అధ్యక్షుడు పి. మురళీకృష్ణ అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరాగాంధీ 40వ వర్ధంతి, సర్దార్ వల్లభాయ్ పటేల్ 145వ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్సీ ఎం. సుధాకర్ బాబు, బజారన్న, బతుకన్న, షేక్ రీయాజుద్దీన్, సత్యనారాయణ గుప్త, వెంకట సుజాత, షేక్ ఖాజా హుస్సేన్, లాజరస్ పాల్గొన్నారు.

ఉల్లి రైతుకు న్యాయం చేస్తాం

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతుకు న్యాయం చేస్తామని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తప్పనిసరిగా రైతులు ఉల్లిగడ్డలను, ఇతర పంట ఉత్పత్తులను గ్రేడింగ్ చేసి అమ్మకానికి యార్డుకు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ సంవత్సరం పెద్ద ఎత్తున ఉల్లి పంటను రైతులు సాగు చేశారని, శనగ పంటను వెంటనే వేయాలనే ఆతృతతో రైతులు ఉల్లిగడ్డలను కర్నూలు మార్కెట్ యార్డు కు ఒకేసారి తీసుకురావడం వల్లనే కొనుగోళ్లు ఆలస్యమయ్యాయని ఆమె తెలిపారు.

కార్తీక మాస పూజలు ప్రారంభం

కల్లూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం నుంచి కార్తీకమాసం పూజలు ప్రారంభం కానున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి ట్రస్టీ టి.శివరామక్రిష్ణ పేర్కొన్నారు. నవంబరు 2వ తేదీ నుంచి డిసెంబరు ఒకటి వరకు ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

సెక్యూరిటీ ఏజెన్సీని రద్దు చేయాలి: ఎస్ఎఫ్ఐ

కర్నూలు అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో బీఎంఎస్ ఏజెన్సీని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వర్సిటీ కార్యదర్శి రామక్రిష్ణ మాట్లాడుతూ ఆగస్టు 31తో సెక్యూరిటీ ఏజెన్సీ కాలపరిమితి ముగిసినా కొత్త టెండర్లు ఎందుకు పిలువలేదని ప్రశ్నించారు. నెలకు దా దాపు రూ.4లక్షలు ఏజెన్సీకి ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ సమావేశంలో నాయకులు మౌలాలి, సందీప్, రాజు, రమేష్ ప్రకాష్ పాల్గొన్నారు.

గ్రామసభలో సమస్యలు పరిష్కారం

కల్లూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామసభలో సమస్యలు పరిష్కారమవుతాయని కల్లూరు తహసీల్దారు కె. ఆంజనేయులు అన్నారు. శుక్రవారం ఉలిందకొండ (ఎర్రకత్వ, కొల్లంపల్లి తాండ) గ్రామ సచివాలయంలో అయన రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా తహసీల్దారు కె. ఆంజనేయులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేపట్టిన భూ రీసర్వేలో అనేక తప్పులు చోటు చేసుకున్నాయని, రైతుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రామసభలకు శ్రీకారం చుట్టిందన్నారు. రైతులు రీసర్వేలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకోవాలన్నారు. సర్వేయర్ శ్రీని వాసులు, టీడీపీ సీనియర్ నాయకులు ఈవీ రమణ, రంగస్వామిరెడ్డి, సర్పంచు సుంకులమ్మ, ఎంపీటీసీలు అనూరాధ, చంద్రకళ, టీడీపీ నాయకులు నరేంద్ర, హీరూనాయక్, శంకర్‌నాయక్, మద్దయ్య పాల్గొన్నారు.

విజేతలకు కమిషనర్ అభినందన

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల రాజమహేంద్రవరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారిణి కుమారి మైత్రి బంగారు పతకం సాధించింది. అలాగే అక్టోబరులో జరిగిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గుంటూరులో నిర్వహించిన సౌత్‌జోన్ అథ్లెటిక్‌లో ఆర్.హేమంత్ కాంస్య పతకం సాధించాడు. నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్ర బాబు విజేతలకు అభినందనలు తెలిపారు.

ఈడిగ సంఘం నాయకుల హర్షం

కర్నూలు రూరల్ నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశంపార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్‌కు టీటీడీ సభ్యుడిగా పదవి దక్కడంపై ఉమ్మడి జిల్లాల ఈడిగ సంఘం నాయకులు కేతు వేమన్నగౌడ్, నంద్యాల ఖాజన్నగౌడ్ హర్షం వ్యక్తం చేశారు. కర్నూలు నగరంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా ఈడిగ సంఘం నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. మల్లెల రాజశేఖర్‌పై ఎంతో నమ్మకంతో టీటీడీ సభ్యుడిగా పదవి ఇచ్చిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, నారా లోకేష్‌లకు ఈడిగ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. నాగశేషన్న గౌడ్, రామన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

కర్నూలు న్యూసిటీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని సుందరయ్య భవన్, రెవెన్యూ కాలనీలో డీవైఎఫ్ఐ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. జిల్లా నాయకులు శంకర్ అధ్యక్షతన సుందరయ్య కూడలిలో జిల్లా కార్యదర్శి నగేష్ పతాకాన్ని ఆవిష్కరించారు. మాజీ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, డీవైఎఫ్ఐ మాజీ నాయకులు పీఎస్.రాధాక్రిష్ణ, హుసేన్, శిరీష, విక్రమ్ పాల్గొన్నారు.

శ్రామిక రాజ్యస్థాపనే ఏఐటీయూసీ లక్ష్యం

దేశంలో శ్రామిక రాజ్యస్థాపనే లక్ష్యంగా ఏఐటీయూసీ పని చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి జే.లలి తమ్మ అన్నారు. శుక్రవారం ఏఐటీయూసీ 105 వ్యవస్థాక దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని కార్మిక కూడళ్లలో జెండాలను ఆవిష్కరించారు. అనంతరం మాజీ ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి గురుదాస్ గుప్తా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్.మునెప్ప, వెంకటేష్ పాల్గొన్నారు.

వైన్‌షాపులను తొలగించాలి

ఎమ్మెల్యే గౌరు చరితకు మహిళల వినతి


గౌరు చరితకు సమస్యను విన్నవిస్తున్న మహిళలు

కల్లూరు/ కర్నూలు అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కల్లూరు అర్బన్ 19వ వార్డులోని జోహరాపురం ప్రధాన రహదారిపై నివాసాల మధ్య ఏర్పాటు చేసిన వైన్ షాపులను తొలగించాలని కాలనీ ప్రజలు డిమాండ్ చేశారు. శుక్రవారం షిరిడీసాయినగర్, చంద్రశేఖర్ నగర్‌కు చెందిన కాలనీల మహిళలు పాణ్యం ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే గౌరు చరితను కలిసి వినతిపత్రం అందజేశారు. వైన్‌షాపులు దక్కించుకున్న నిర్వాహకులు జోహరాపురం ప్రధాన రహదారిపై కేపీ డీవీఆర్ వైన్స్ షాపులను ఏర్పాటు చేశారని, గత కొన్ని రోజులుగా మందుబాబుల వీరంగంతో అవస్థలు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

● నంద్యాల చెక్ పోస్టు వద్ద జనావాసాల మధ్య ఉన్న డీవీఆర్‌కేపీ వైన్ షాప్‌ను వెంటనే తొలగించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య, అఖిల భారత యువజన సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ సుధీర్ బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.శ్రావణి రెడ్డి, భారతీ, పావని, కే.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

కర్నూలు క్రైం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే పొగమంచులో శైవ క్షేత్ర ఆలయాలకు, నదితీర ప్రాంతాలు, అతివేగంగా ప్రవహించే కాలువలు, వంకలు లోతుగా ఉన్న చెరువుల్లో పుణ్య స్నానాలు ఆచరించడానికి వెళ్లే భక్తులు తమ వెంట చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు తీసుకెళ్లితే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జి.బిందుమాధవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు నదులలో స్నానాలు ఆచరించడానికి కార్తీక దీపాలు వదలడానికి వినాయక ఘాట్, ఓర్వకల్లు కాల్వబుగ్గకు, వెల్దుర్తిలోని బ్రహ్మగుండేశ్వరం, శివాలయం, గురజాల గ్రామం శివాలయం, తుంగభద్ర నదితీర ప్రాంతాల వద్దకు భక్తులు అధిక సంఖ్యలో వెళ్తుంటారని అన్నారు. ఆ ప్రాంతాల్లో దొంగల బెడద ఎక్కువగా ఉంటుందని, ఒంటరిగా వెళ్తున్న సమయంలో మహిళలు జాగ్రత్తగా ఉండా లన్నారు. నది తీర ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌లో తనిఖీలు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని బండిమెట్ట అర్బన్ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.భాస్కర్ తనిఖీ చేశారు. ఆ ప్రాంతాల్లోని నీటి నిల్వలు ఉన్న డ్రమ్ములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వారానికి ఒక్కసారి నీటి నిల్వలు లేకుండా ప్రతి శుక్రవారం పూర్తిగా తొలగించాలన్నారు. ప్రజలంతా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంఈ నూకరాజు, బండిమెట్ట వైద్యాధికారి డా.ముషాహీర్ చౌదరి పాల్గొన్నారు.

హరికృష్ణకు డాక్టరేట్

కర్నూలు, ఎడ్యుకేషన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో గణిత ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఎం.హరికృష్ణకు అనంతపురం శ్రీకృష్ణ దేవరాయల యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. అనంతపురం ఆర్ట్స్ కళాశాల డాక్టర్ జి.ప్రభాకర్‌రావు పర్యవేక్షణలో అన్‌స్టెడి ఎంహెచ్‌డీ కన్‌వెక్టివ్ ఫ్లో త్రూ ప్లానర్ చానల్స్ అనే అంశంపై పరిశోధనలో శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా హరికృష్ణకు కళాశాల యజమాన్యం, అధ్యాపకులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత వారం రోజులుగా ఈనామ్ సర్వర్ పనిచేయకపోవడంతో ఉల్లి రైతులు కర్నూలు యార్డుకు తెచ్చిన ఉల్లిని వ్యాపారులు కొనే అవకాశం లేకపోయిందని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జిల్లా ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులుకు వినతి పత్రం అందజేశారు.

'రైతులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం'

కర్నూలు న్యూసిటీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతులకు తీవ్ర అన్యాయం చేస్తుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఎస్వీ కాంప్లెక్స్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు కావాల్సిన పథకాలు అందజేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, కార్పొరేటర్లు జుబేర్, యూనుస్ బాషా పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లెక్చరర్లు, పీబీవీ సుబ్బయ్య

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కళాశాలలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.మల్లికార్జునరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు రామకృష్ణ, విజయశేఖర్, సోమేష్, లక్ష్మి, ఉల్లోజి రావు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా మాధవీనగర్ రవీంద్ర ఇంగ్లీషు మీడియం స్కూల్, రెవెన్యూ కాలనీలోని రవీంద్ర టాలెంట్ స్కూల్‌లో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కరస్పాండెంట్ పీబీవీ సుబ్బయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ శారదదేవి, కోఆర్డినేటర్ అక్తర్‌బేగం పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి


షూటింగ్ బాల్ క్రీడాకారులతో న్యాయవాది, క్రీడా ప్రతినిధులు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని న్యాయవాది జి.శ్రీధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి సీనియర్ పురుషుల విభాగంలో నిర్వహించిన షూటింగ్ బాల్ పోటీల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. జిల్లా సీనియర్ పురుషుల షూటింగ్ బాల్ పోటీల్లో విజేతగా డా.బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల (చిన్నటేకూరు), ద్వితీయ స్థానంలో ఆదర్శ జూనియర్ కళాశాల (కర్నూలు), తృతీయ స్థానంలో డా.బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలుర విద్యాలయం (సి.బెళగల్) జట్లు నిలిచాయని జిల్లా షూటింగ్ బాల్ కార్యదర్శి నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరశురాముడు, జిల్లా యోగా సంఘం కార్యదర్శి ప్రభాకర్, ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న సుంకన్న పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే టీడీపీ ధ్యేయం

- టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్
- ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ



ఆలూరు, నవంబరు 1,(ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమమే టీడీపీ ప్రభుత్వం ధ్యేయమని ఆ పార్టీ ఆలూరు ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. శుక్రవారం తాహసీల్దార్ కార్యాలయంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీని ప్రారంభించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. ఈ పథకం మహిళలకు ఇంతగానో ఉపయోగపడుతుందని, సూపర్ సిక్స్ హామీలను విడతల వారీగా సీఎం నేరవేరుస్తారన్నారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు మాత్రమే పూర్తయిందని, ప్రతిపక్షం ప్రభుత్వంపై బురద జల్లే కార్యక్రమాన్ని చేస్తుందన్నారు. హామీ మేరకు తల్లికి వందనం ద్వారా ఇంట్లో ముగ్గురు పిల్లలకు రూ.18వేలు చొప్పున అందిస్తామన్నారు. తహసీల్దార్ గోవింద్ సింగ్, ఆర్‌ఐ బసవన్న గౌడ్, పవన్ భారత్ గ్యాస్ నిర్వాహకులు వెంకటేష్ చౌదరి, నారాయణ, నెట్టప్ప, మండల కన్వీనర్ అశోక్, జిల్లా నాయకులు నరసప్ప, సురేంద్ర, వన్నూర్ వల్లి, రాము యాదవ్, గుల్యం రామాంజినేయులు, మసాలా జగన్, వెంకటేశ్, కిట్టు, శివ ఆంజనేయ, హనుమప్ప పాల్గొన్నారు.

దీపం పథకాన్ని వినియోగించుకోండి

ఆదోని రూరల్ నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దీపం-2 పథకాన్ని వినియోగించుకోవాలని తహసీల్దార్ శివరాముడు సూచించారు. శుక్రవారం సోమేశ్వర గ్యాస్ ఏజెన్సీలో మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. ఆదోని నియోజకవర్గంలో ఉచిత గ్యాస్ సిలిండర్లకు 58,104 మంది లబ్ధిదారులన్నారు. డీటీ వలి బాషా, నాయకులు పాల్గొన్నారు.









పేదల అభ్యున్నతి కోసమే ఆర్డీటీ సేవలు



మాట్లాడుతున్న స్పెయిన్ దేశస్థురాలు

మంత్రాలయం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పేదల కుటుంబాల అభ్యున్నతి కోసమే ఆర్డీటీ సేవలందిస్తుందని స్పెయిన్ దేశస్థురాలు బారాబరా అన్నారు. శుక్రవారం మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన పేతురు, సునీత కుటుంబాన్ని సందర్శించి ఆర్డీటీ ద్వారా అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. విద్య, సంక్షేమం, వైద్యం, భూముల అభివృద్ధి, కుట్టు శిక్షణ ఉచితంగా అందిస్తామని అన్నారు. ఏరియా టీం లీడర్ కృష్ణయ్య, సీఓ నరసింహులు, ఆర్డీటీ లీడర్లు లాజరు, సంసోను, మత్తయ్య, మునెప్ప, ఆదాము, ఏసేపు, దానియేలు, రామయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆదోని టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీ రాములుకు ఆపోపా సభ్యులు నివాళి అర్పించారు. అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు శ్రీనాథ్ గుప్త, నాయకంటి రఘు అధ్వర్యంలో మునిసిపల్ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్కులు, పెన్నులను పంపిణీ చేశారు. డా.గోపినాథ్, మల్లికార్జున గౌడ్, శంకరమ్మ, సంఘం సభ్యులు మిరియాల భద్రీనాథ్, యతగిరి వెంకటేషులు, కుప్ప రాజేష్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

శ్రీ మఠానికి రూ.7లక్షల విరాళం

మంత్రాలయం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మఠానికి బెంగళూరు భక్తుడు శ్రీనాథ్ రూ.2 లక్షలు, నెల్లూరుకు చెందిన ఇంకోళ్ల సుబ్బరామ శాస్త్రి అనే భక్తుడు రూ.5 లక్షలు విరాళమిచ్చినట్లు ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి తెలిపారు. శుక్రవారం వేర్వేరు సమయాల్లో వారు కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని విరాళం ఇచ్చినట్లు తెలిపారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- డీఈవో శ్యామ్యూల్ పాల్
- డీఈవో ఉండగానే విద్యార్థినులచే కుర్చీలు మోయించిన ఉపాధ్యాయులు



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో శ్యామ్యూల్ పాల్

వెల్దుర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని డీఈవో శ్యామ్యూల్ పాల్ సూచించారు. శుక్రవారం వెల్దుర్తి జడ్పీ హైస్కూల్ (బాలికలు)ను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. పాఠశాల తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. సెల్‌ఫోన్‌లు, టీవీ, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని సూచించారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వినాలని, సందేహాలుంటే అడిగి తెలుసుకోవాలన్నారు. బాగా చదివి పాఠశాలకు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని కోరారు.

పాఠశాలలో 1,200 మంది చదువుతున్నారని, సరిపడా బాత్ రూమ్‌లు లేవని ఆర్వోప్లాంటు పనిచేయడం లేదని ఉపాధ్యాయులు డీఈవో దృష్టికి తీసుకెళ్లారు.

విద్యార్థులా..?..కార్మికులా..?

డీఈవో ఉండగానే ఉపాధ్యాయులు విద్యార్థులచే కుర్చీలు మోయించారు. విద్యార్థులతో పని చేయించకూడదని విద్యాహక్కు చట్టంలో ఉన్నా, ఇలా డీఈవో ఎదుటే పనులు చేయించడంపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కుర్చీలు మోస్తున్న విద్యార్థినులు

ఉరుకుందలో లక్ష పుష్పార్చన



పాల్గొన్న రాఘవేంద్ర రెడ్డి దంపతులు

కౌతాళం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా దేవాలయంలో భక్తుల సందడి కొనసాగింది. అమవాస్య సందర్భంగా ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈఓ విజయరాజు ఆలయంలో స్వామి వారికి అమావాస్య సందర్భంగా లక్ష పుష్పార్చన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇంచార్జీ రాఘవేంద్ర రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

- ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసాలో శుక్రవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి పాల్గొని పింఛను అందజేశారు. మండల అధ్యక్షుడు ఉలిగయ్య, సురేష్ నాయుడు, సతీష్ నాయుడు, మహదేవ, చిరంజీవి ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

హాలహర్వి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా ఉంటానని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అన్నారు. శుక్రవారం చత్రగుడి వద్ద ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయాలని అన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు అందించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. పేదలకు మంచి జరగాలంటే జగన్‌తోనే సాధ్యమన్నారు. కన్వీనర్ రామిరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జనార్దన్ నాయుడు, అర్దగేరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దయాసాగర్

ఎమ్మిగనూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆయా వార్డుల్లో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ సభ్యత్వం నమోదు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే బీవీ సమక్షంలో 15మంది శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. శుక్రవారం పట్టణంలోని 21 వార్డులో టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఉసేన్ పీరా ఆధ్వర్యంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దయాసాగర్ టీడీపీ సభ్యత్వనమోదు నిర్వహించారు. పలువురు వార్డు ప్రజలకు సభ్యత్వం అందజేశారు. అలాగే 3,4, 15, 17, 33,11 వార్డులతో పాటు ఆయా వార్డుల్లో టీడీపీ వార్డు ఇన్‌చార్జిలు, వార్డు మాజీ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.

భూములు కోల్పోయాం



మాట్లాడుతున్న తహసీల్దార్ శివరాముడు

ఆదోని రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రీసర్వేలో భూములు కోల్పోయామని గణేకల్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం గణేకల్లులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. దాదాపు 47మంది రైతులు తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. రీసర్వే చేయించి పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

గ్రామాభివృద్ధికి పాటు పడాలి: డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

మంత్రాలయం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. గురువారం దీపావళి వేడుకలను మాధవరం తండాలో గిరిజనుల మధ్య జరుపుకున్నారు. ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన గోగ్రీన్ 5కే రన్‌లో పాల్గొన్నారు. ఉద్యోగాలు చేస్తూ సొంత గ్రామం అభివృద్ధికి సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. గిరిజనులు సారా తయారు చేసి అమ్మే వారి పేర్లను తుడిచిపెట్టేలా ఐక్యమత్యంతో విభేదాలు లేకుండా కలిసికట్టుగా ఉండాలన్నారు. అనంతరం గ్రీన్ కే రన్ టీషర్టులను అందజేశారు. ముఖ్యఅతిథిగా వచ్చిన డీఎస్పీకి శాలువతో సన్మానించారు. సీఐ రామాంజులు, మంత్రాలయం, మాధవరం ఎస్ఐలు పరమేష్ నాయక్, విజయకుమార్, అసోసియేషన్ నాయకులు మహేంద్ర, లింగప్ప, ముని నాయక్, చంద్రలోక నాయక్, చింతామణి నాయక్, వెంకటేశ్ నాయక్, ఉపాధ్యాయులు కొండప్ప, నారాయణ నాయక్, రంగ నాయక్, అమ్రేష్ నాయక్, గాంది నాయక్, శంకర్ నాయక్, ముని నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పాలన

పత్తికొండ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగుతుందని సర్పంచ్ గౌరవ సలహా దారులు నాగరత్నమ్మ, సర్పంచ్ కొమ్ముదీపిక, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం 20వ వార్డులో నూతన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఉప సర్పంచ్ పల్లె కళావతి పాల్గొన్నారు.



సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న నాగరత్నమ్మ

పెచ్చులూడుతోంది..

ఆదోని, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ చిన్న పిల్లల ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరింది. కప్పు పెచ్చులూడుతుండటంతో ఎప్పుడు ఎవరి తలమీద పడుతుందోనని రోగులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు స్లాబులోకి నీరు చేరి పెచ్చులూడి కడ్డీలు కనిపిస్తున్నాయి. సూపరింటెండెంట్ స్పందించి మరమ్మతులు చేయించాలని రోగులు కోరుతున్నారు.



పెచ్చులూడుతున్నఆసుపత్రి భవనం కప్పు

మద్యం దుకాణాల తనిఖీ

పెద్దకడబూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక మద్యం దుకాణం-75,76లను ఎక్సైజ్ శాఖ జిల్లా ఏఈఎస్ రామకృష్ణారెడ్డి, సీఐ రాజేంద్రప్రసాద్, కోసిగి ఎక్సైజ్ సీఐ భార్గవ్‌రెడ్డి తనిఖీ చేశారు. బాటిళ్లను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మద్యం విక్రయించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు

ఆదోని రూరల్ నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భర్త వేధిస్తున్నాడని శాంతి అనే మహిళ శుక్రవారం ఇస్వీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల మేరకు.. పెసలబండ గ్రామానికి చెందిన గోపాల్‌తో ఏడాది క్రితం బదినేహాళకు చెందిన శాంతితో వివాహమైంది. పెళ్లైన నాటి నుంచి మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ నాగేంద్ర తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఆలూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులో శుక్రవారం రాత్రి పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు. రూ.12,180, మూడు బైకులు, మూడు సెల్ ఫోనులు స్వాధీనం చేసుకున్నారు.

శభాష్.. విద్యుత్ సిబ్బంది

- బస్సు పైకి ఎక్కి విద్యుత్ తీగల మరమ్మతు



బస్సుపై ఎక్కి తీగెలను సరి చేస్తున్న సిబ్బంది

పత్తికొండ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుత్తి టర్నింగ్ ప్రధాన రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ తీగెలు తెగి కింద పడ్డాయి. అప్రమత్తమైన విద్యుత్ అధికారులు సరఫరాను నిలిపివేశారు. వీటిని ఎలా అతికించాలని ఆలోచనలో ఉండగా ఓ బస్సు వచ్చింది. సిబ్బంది బస్సును ఆపి టాపుపైకి ఎక్కి మరమ్మతులు చేశారు. అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. సిబ్బందిని ప్రజలు అభినందించారు.

పేదలకు ఉచితంగా గ్యాస్

మద్దికెర, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులైన పేదలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నట్లు తహసీల్దార్ హుశేన్‌సాహెబ్ అన్నారు. శుక్రవారం భారత్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఉచిత సిలిండర్లను పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు సూపర్‌సిక్స్‌లో భాగంగా ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తున్నారన్నారు. జిల్లా కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, మాజీ జడ్పీటీసీ జమేదార్ రాజన్న యాదవ్, మాజీ సర్పంచ్ కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ బండారు సుహాసిని, బండారు ఆంజనేయులు, ఎన్.లక్ష్మినారాయణ, గడ్డం రామాంజులు, చంద్ర ఉన్నారు.

ఫీజుల దోపిడీ అరికట్టాలి

- ఆర్డీవోకు వినతిపత్రం

పత్తికొండ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని జైభీమ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సోమన్న డిమాడ్ చేశారు. శుక్రవారం ఆర్డీవో భరత్ నాయక్‌కు వినతి పత్రం ఇచ్చారు. సిలబస్ పేరుతో తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ మోసగిస్తున్నారని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు.

టీడీపీ సభ్యత్వంతో బీమా

తుగ్గలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో రూ.5 లక్షలు బీమా వర్తిస్తుందని మాజీ సర్పంచ్ బర్మ వీరేష్, సర్పంచ్ విజయ్, శ్రీనివాసులు గౌడ్అన్నారు. శుక్రవారం ఎద్దులదొడ్డి, పెండేకల్ గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. లాయర్ వెంకటేశ్వర్లు, రామచంద్ర, ఓలప్ప, రవికుమార్, వల్లె వెంకటేష్, ఎరువుల తిమ్మప్ప పాల్గొన్నారు.

సబ్సిడీ వేరుశనగ విత్తనాలు మంజూరు : ఏవో

దేవనకొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలానికి రబీలో 15వందల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మంజూరైనట్లు ఏవో సురేష్‌బాబు తెలిపారు. కే6, టీసీజీఎస్16 క్వింటం ధర రూ.5760లు, కదిరి లేపాక్షి రూ.5 వేలుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కాలువలు, బోర్ల కింద సాగు చేసే రైతులు రైతుసేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలన్నారు. రబీ పంటలకు బీమా సౌకర్యం ఉందని తెలిపారు.

ఘనంగా దీపావళి

ఆలూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో దీపావళి వేడుకలు గురువారం ఘనంగా జరుపుకున్నారు.. ఇళ్ళ ముందు దీపాలు వెలిగించి బాణసంచా కాల్చారు. దుకాణాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలూరులో మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం కుటుంబ సభ్యులు, టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, జ్యోతి కుటుంబ సభ్యులు, చిప్పగిరిలో ఎమ్మెల్యే విరుపాక్షి కుటుంబసభ్యులు వేడుకలు చేసుకున్నారు.

మద్దికెర: మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం తదితర గ్రామాల్లో దీపావళిని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు, పెద్దలు బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు.

తుగ్గలి: వ్యాపార కేంద్రాలతో పాటు ఆలయాల్లో లక్ష్మీదేవి పూజలు నిర్వహించారు. సాయంత్రం టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు.

పరిష్కారానికి సహకరించాలి

పత్తికొండ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సహకరించాలని ఎస్ఐ గోపాల్ కోరారు. శుక్రవారం పత్తికొండ అంబేడ్కర్ సర్కిల్‌లో తిరుమల పాల వ్యాపారి మధుబాబు గౌడ్ రెండు డివైడర్లను పోలీసు శాఖకు అందజేశారు. ఎస్ఐ మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని, డివైడర్లను అందించడం అభినందనీయమన్నారు.

పిడుగుపాటుతో ఎద్దు మృతి

ఆస్పరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అటికెల్‌లో పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందింది. బాధితుడు శుక్రవారం తెలిపిన మేరకు.. పొలంలో పనులు చేస్తుండగా ఉరుములు, మెరుపులు రావడంతో పనులు ఆపి పొలంలోని పాకలో రెండు ఎద్దులను వదిలాడు. అయితే భారీ శబ్దాలతో ఎద్దు బెదిరి బయటకు వచ్చి పిడుగుపాటుకు గురై మృతి చెందింది. రూ.70వేల ఆస్తి నష్టం వచ్చిందని, ఆదుకోవాలని పెద్దలు శివకుమార్, జీవన్ కుమార్, రాజశేఖర్, కోరారు.

సేవలు మరువలేనివి

ఆదోని టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక రాష్ట్రం తేవడానికి ప్రాణాలను అర్పించిన పొట్టి శ్రీ రాములు సేవలు మరువలేనివని బీజేపీ రాష్ట్ర నాయకులు విట్టా రమేష్ అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

డీవైఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం కార్యకర్తలు చేసుకున్నారు. మండగిరిలో జెండాను పట్టణ నాయకుడు మోహన్ ఆవిష్కరించారు. పట్టణ అధ్యక్షుడు వీరేష్ మాట్లాడుతూ అందరికీ విద్య ఉపాధికి యువత ఉద్యమించాలని పిలుపు నిచ్చారు.

టీడీపీ హయాంలోనే మహిళలకు న్యాయం

టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి




గ్యాస్ సిలిండర్‌ను పంపిణీ చేస్తున్న తహసీల్దార్, టీడీపీ నాయకులు

మంత్రాలయం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే మహిళలకు న్యాయం జరుగుతోందని టీడీపీ మంత్రాలయం నియోజకవర్గం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రాలయంలో సూపర్ సిక్స్ పథకాల హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను ఆయన పంపిణీ చేశారు. ఎస్ఆర్ఎస్ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్ బీవీ జాను, మహ్మద్ సలీం ఆధ్వర్యంలో గ్యాస్ బండికి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం తహసీల్దార్ రవి, ఆర్ఐ భీముడు ఏర్పాటు చేసిన సభావేదికపై రాఘవేంద్రరెడ్డి మాట్లాడారు. అనంతరం ఉచిత సిలిండర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షులు వరదరాజులు, అశోక్ రెడ్డి, తిమ్మప్ప, ఎంపీటీసీ మేకల వెంకటేశ్, రాజన్న, రాఘవేంద్ర, భీమన్న, దాసు, నరసింహులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు టౌన్: ఎమ్మిగనూరు పట్టణంలోని ఎస్ఎంటీ కాలనీలో తహసీల్దార్ శేషాఫణి దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కౌన్సిలర్ సరోజమ్మ, ఉప్పర రవి, సూర్యనారాయణ రెడ్డి, నరసప్ప పాల్గొన్నారు.

కౌతాళం: మహిళల అభివృద్ధే టీడీపీ ధ్యేయమని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి కోట్రేష్‌గౌడ్ అన్నారు. కౌతాళంలో శుక్రవారం మహిళలకు తహసీల్దార్ మల్లికార్జున స్వామి, ఎంపీడీవో సుబ్బరాజుతో కలిసి గ్యాస్ సిలిండర్లను అందజేశారు.

గోనెగండ్ల: నిరుపేద మహిళలకు దీపం 2 పథకం ఎంతో మేలు చేస్తుందని తహసీల్దార్ కుమారస్వామి అన్నారు. శుక్రవారం తిప్పనూరు గ్రామంలో దీపం 2 పథకాన్ని ఆయన ప్రారంభించారు. లబ్ధిదారులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో భారత్ గ్యాస్ మేనేజర్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.







